ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
గురువారం 1 మే 2025
www.prajaswaramdaily.com
4 pm

## ఎర్రవెల్లి మాజీ ఎంపీటీసీ కుమారుడి పెళ్లికి
# కేసీఆర్ దంపతులు

సిద్దిపేట : బీఆర్ఎస్ నేత కుమారుడి వివాహానికి పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు హాజరయ్యారు. ఎర్రవెల్లి మాజీ ఎంపీటీసీ పెద్దోళ్ల భాగ్యమ్మ, వెంకటయ్య యాదవ్‌ల కుమారుడు విష్ణువర్ధన్ వివాహానికి కేసీఆర్, శోభమ్మ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన దంపతులను కేసీఆర్ దంపతులు ఆశీర్వదించారు. వివాహ వేడుకకు హాజరైన కేసీఆర్‌కు వెంకటయ్య యాదవ్ కుటుంబం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ దంపతులు వచ్చి తమ కుమారుడిని, కోడలిని ఆశీర్వదించడం ఆనందంగా ఉందన్నారు.



# ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత మీదే

### కార్మికులు సమ్మె ఆలోచన వీడండి..
### పంతాలు, పట్టింపులకు పోకండి: సీఎం రేవంత్



హైదరాబాద్ : కార్మికులు సమ్మె ఆలోచన వీడండి అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మే డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోంది. ఇది మీ సంస్థ.. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్మికులపైనే ఉంది అని అన్నారు. పదేళ్లలో విధ్వంసం జరిగింది.. రాష్ట్రంలో ఆర్థిక దోపిడీ కొనసాగిందన్నారు. ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోకండికని, ఏదైనా సమస్య ఉంటే మంత్రితో చర్చించండి.. వచ్చే ఆదాయమంతా మీ చేతిలో పెడతాం.. ఎలా ఖర్చు చేద్దామో మీరే సూచన చేయండి అని అన్నారు. అణా పైసా కూడా నేను ఇంటికి తీసుకెళ్లేది లేదు.. మీ కోసమే ఖర్చు చేస్తాం.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు.. అందుకే ఒకసారి ఆలోచించండి అని అన్నారు.

ఇక, కష్టమైనా, నిష్ఠూరమైన ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉంది అని తెలిపారు. సమ్మె పోటు రాష్ట్రానికి నష్టం చేస్తుంది.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతోంది.. మరో ఏడాదిలో కొంత కుదురుకుంటుంది.. పదేళ్లు ఏం చేయని వాళ్లు వచ్చి చెబితే వాళ్ల వలలో పడొద్దు.. వారి విషపు చూపుల్లో చిక్కుకోవద్దు అని సూచించారు. ఆర్టీసీ కార్మికులు తనను నమ్మండి.. నమ్ముకున్న వారికి అండగా ఉంటాను అని చెప్పుకొచ్చారు.

# చరిత్ర పుటల్లో నిలిచిపోనున్న కులగణన

### ప్రధానికి ధన్యవాదాలు
### కేంద్రం నిర్ణయం తర్వాత
### ప్రతిపక్షాలు నాటకాలకు నాంది
### బీసీ రిజర్వేషన్లలో కాంగ్రెస్ అనేక కుట్రలు
### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్ : ప్రధాని మోదీ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో జరగబోయే జనగణనలో కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సందర్భంగా ప్రధానికి హృదయపూర్వక ధన్యవాదాలు.. దేశంలో సానుకూలమైన మార్పుకు, కులగణన.. చరిత్రాత్మకమైన కులగణన, చరిత్ర పుటల్లో నిలిచిపోనుంది అని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు నాటకాలకు తెరలేపుతున్నారు.. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లకు సంబంధించి, కుట్రలు కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. అలాగే, ముస్లింలను తీసుకెళ్లి బీసీల్లో చేర్చడం దారుణం.. కాంగ్రెస్ అన్ని తప్పుడు నిర్ణయాలు చేసింది అనిఅన్నారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ రాష్ట్రపతుల అభ్యర్థిత్వాలను వ్యతిరేకించింది అని పేర్కొన్నారు.

కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మోడీనీ కులం పేరుతో దూషించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. మొదటి నుంచి బీసీల పట్ల మొసలి కన్నీరే కార్చిందన్నారు. 2018లో ప్రధాని అయ్యాక బీసీ కమిషన్ కు రాజ్యాంగ బద్దంగా చట్టం చేశారన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేయ్యాలని.. ఆర్థికంగా వెనకబడిన వర్గాల కోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది కేంద్ర ప్రభుత్వం అని కిషన్ రెడ్డి అన్నారు.

కాగా, మహిళల సాధికారిత కోసం 35 శాతం రిజర్వేషన్లు కల్పించామని పేర్కొన్నారు. ముస్లిం మహిళల కోసం ట్రిపుల్ తలాక్ రద్దు చేసి, వాళ్లకు న్యాయం చేసింది మోదీ సర్కార్ అని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా.. దేశ హితం కోసమేనన్నారు. న్యాయ స్థానాలకు తీర్పుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోంది.. మేం చేసే కులగణనలో మతం ప్రాతిపదికన ఏ మతాలను బీసీల్లో చేర్చేది లేదు అని తేల్చి చెప్పారు.

# కేసీఆర్ చేసిన అప్పులకే లక్షా 2 వేల కోట్లు రుణం తెచ్చా

### వారానికి ఒక రోజు సెలవు కార్మికుల పోరాట ఫలితమే..
### ఖజానా అంతా లూటీ చేసిన పథకాలు ఆపలేదు..
### తెలంగాణలో ఆర్థిక మాంద్యం తక్కువ
### గుజరాత్ లో ఒక్క ఏడాదిలో 58 వేల ఉద్యోగాలు ఇచ్చారా?
### సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : కేసీఆర్ చేసిన అప్పులు కట్టడానికి లక్ష రెండు వేల కోట్లు అప్పు తెచ్చిన.. వడ్డీలు కట్టడానికే సరిపోతుంది.. ఏ పథకం అయినా ఆగిందా?.. అని ముఖ్యమంత్రి రేవంత్ ప్రశ్నించారు. రవీంద్ర భారతిలో జరుగుతున్న మేడే వేడుకల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారానికి ఒకరోజు సెలవు.. కార్మికుల పోరాట ఫలితమే అన్నారు. ఇక, తెలంగాణలో ఆర్థిక మాంద్యం తక్కువ ఉందన్నారు. సింగరేణిలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు మొదటి సారి మనమే బోనస్ ఇచ్చాం.. సింగరేణిని నిర్వీర్యం చేశారు పదేళ్లు.. కారుణ్య నియామకాలు సరళీకృతం చేశాం.. ఒక కుటుంబమే 7 లక్షల కోట్లు అప్పు చేసింది అని ఆరోపించారు. కార్మికుల పట్ల ఎప్పుడైనా అనుకూలంగా మాట్లాడారా వాళ్ళు.. లక్ష రెండు వేల కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లకు ఇచ్చాడు.. కానీ కట్టిన ముడేళ్లకే కూలి పోయింది అని మండిపడ్డారు.

ఇక, ఖజానా అంతా లూటీ చేసినా ఏ పథకం ఆగలేదని తెలిపారు. పేద ప్రజల ఇండ్లో సన్న బియ్యం ఇస్తున్నాం.. గుజరాత్ లో కూడా ఏడాదిలో 58 వేల ఉద్యోగాలు ఇచ్చారా?.. నేను ఇచ్చిన.. మనం దివాలా తీశాం.. కేసీఆర్ కుటుంబం మాత్రం కోట్లు వెనకేసుకున్నారు అని ఆరోపించారు

# ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు రండి

### కేటీఆర్‌ను ఆహ్వానించిన సంస్థ వ్యవస్థాపకులు సిద్ధార్ధ్ సేరీ

హైదరాబాద్ : మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నారు. 2025 జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్‌లో జరిగే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు ముఖ్య వక్తగా పిలుస్తూ ఆ సంస్థ ప్రత్యేకంగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, ప్రొఫెసర్లు, వివిధ దేశాల నిపుణులు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఇండియా సాధిస్తున్న ప్రగతిని కేటీఆర్ వివరించనున్నారు.

"భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు" అనే థీమ్‌తో ఈ సంవత్సరం ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం వ్యవస్థాపకులు సిద్ధార్ధ్ సేరీ తెలిపారు. కేటీఆర్ తన అనుభవాలను, ఆలోచనలను అంతర్జాతీయ విద్యార్థులు, వివిధ దేశాల నిపుణులతో పంచుకుంటే చర్చలు మరింత ఆసక్తికరంగా ఉంటడంతో పాటు భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో భాగం అవ్వడానికి వారందరికీ స్ఫూర్తిగా ఉంటుందని సిద్ధార్ధ్ సేరి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంతో పాటు భారత్‌లోని స్థిరమైన అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు ఎలా ఉపయోగపడతాయన్న అంశంపై ఈ సదస్సులో ప్రధానంగా వక్తలు చర్చిస్తారు. తెలంగాణలో అమలు చేసిన వినూత్న విధానాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి మోడల్‌ను కేటీఆర్ వివరించనున్నారు. ఈ ఆహ్వానాన్ని స్వీకరించి, సదస్సుకు రావాలని సిద్ధార్ధ్ కోరారు.



# అత్యంత క్లిష్ట సమయం.. ఇలాంటి వ్యాజ్యాలు తగవు

### పహల్గామ్ ఉగ్రదాడిపై న్యాయ విచారణ కోరిన పిటిషన్ తిరస్కరణ
### భద్రతా బలగాల స్థయిర్యాన్ని దెబ్బతీసే చర్యలు వద్దని హితవు
### ఉగ్రవాద ఘటన విచారణకు న్యాయమూర్తులు నిపుణులు కారని స్పష్టం

న్యూఢిల్లీ : కోర్టు సూచనతో వ్యాజ్యాన్ని వెనక్కి తీసుకున్న పిటిషనర్ జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడి ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇది చాలా క్లిష్టమైన సమయమని, ఇలాంటి సున్నితమైన విషయాల్లో పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది.

### భద్రతా బలగాల స్థైర్యం దెబ్బతీయొద్దు

ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం పిటిషనర్‌పై కొంత అసహనం వ్యక్తం చేసింది. "దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు పౌరులందరూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కలిసి రావాలి. ఇలాంటి వ్యాజ్యాలు వేసే ముందు వాటి సున్నితత్వాన్ని అర్థం చేసుకోవాలి. మీ చర్యల ద్వారా భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా? దేశం పట్ల మీకు కూడా బాధ్యత ఉందని గుర్తుంచుకోండి" అని ధర్మాసనం హితవు పలికింది. ఉగ్రవాద దాడుల వంటి అంశాలను న్యాయ సమీక్ష పరిధిలోకి తీసుకురావడానికి ప్రయత్నించవద్దని స్పష్టం చేసింది.



# 3.5 కిలోల బంగారం సీజ్

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం పట్టివేత..
### మస్కట్ నుంచి వచ్చిన విమాన సిబ్బంది వద్ద గుర్తింపు
### చేసిన డీఆర్ఐ

హైదరాబాద్ : శంషాబాద్ ఎయిర్ పోర్టులో భారీగా బంగారం పట్టుబడింది. మస్కట్ నుంచి వచ్చిన విమాన సిబ్బంది వద్ద బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎయిర్ పోర్ట్ నుంచి పార్కింగ్ వరకు బంగారం తీసుకొచ్చి అప్పగిస్తుండగా పట్టుకుని.. 3.5 కిలోల బంగారాన్ని సీజ్ చేశారు. విలువ దాదాపు 3 కోట్ల 45 లక్షల రూపాయలు ఉంటుందని అంచానా వేశారు. బంగారం స్మగ్లర్ కి సహకరించిన గ్రౌండ్ స్టాప్ ని డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు.

